

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్: ఎస్పీ

బెలగాం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డీజీపీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ నెల 10 వరకు డ్రంకెన్ డ్రైవ్‌పై, 11 నుంచి 17 వరకు అతి వేగంపై, 18 నుంచి 24 వరకు హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నారని, ద్విచక్రవాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

సాగుకు సాయం..అన్నదాతల్లో ఆనందం


ఆనందంగా ఉంది..



సాగుకు ప్రభుత్వ సాయం అందింది. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద నా బ్యాంకు ఖాతాలో రూ.7 వేలు జమైంది. చాలా ఆనందంగా ఉంది. నాకు ఎనిమిది ఎకరాల భూమి ఉంది. మొక్కజొన్న, వరి, పత్తి పంటల పెట్టుబడులకు ఈ మొత్తం ఎంతగానో ఉపయోగపడుతుంది. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటా.

- గంట భాస్కరరావు, కర్రివలస, పాచిపెంట మండలం

● బ్యాంక్‌ల వద్ద రైతుల సందడి



సీతంపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం కింద నిధులు విడుదల చేయడంతో బ్యాంక్‌ల వద్ద రైతుల సందడి కనిపిస్తోంది. మంగళవారం సీతంపేటలో ఉన్న బ్యాంక్‌లు రద్దీగా దర్శనమిచ్చాయి. తమ ఖాతాల్లో జమ అయిన నగదును విత్‌డ్రా చేసుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున రైతులు తరలివచ్చారు. బ్యాంక్‌ల నుంచి నగదు తీసుకున్న అనంతరం ఆనందంతో ఇంటిదారి పట్టారు. నగదు లెక్కపెట్టుకుంటూ.. ఉత్సాహంగా కనిపించారు. వ్యవసాయ పెట్టుబడులకు ఈ డబ్బులు ఎంతగానో ఉపయోగపడతాయని పలువురు తెలిపారు.



అన్నదాత సుఖీభవ నగదు కోసం సీతంపేటలో ఓ బ్యాంక్ వద్ద రైతులు ఇలా..

మదుపులకు ఊతం




ఖరీఫ్ సాగుకు అవసరమయ్యే మదుపులకు ఊతం లభించింది. అన్నదాత సుఖీభవ పథకం ఆదుకుంది. గ్రామంలో ఎకరన్నర వ్యవసాయ భూమి ఉంది. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీ భవ పథకం కింద అందించిన రూ.5 వేలతో ఎరువులను కొనుగోలు చేస్తా. పీఎం కిసాన్ నిధులు జమ కావాల్సి ఉంది

- అక్కేన స్వామినాయుడు, రైతు, సాంబన్నవలస, గరుగుబిల్లి మండలం

19 నుంచి పీ-4

● కార్యక్రమం అమలు చేయాలి
● మార్గదర్శుల ఎంపిక పూర్తి స్వచ్ఛందమే..
● కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



పార్వతీపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో భాగంగా చేపట్టిన పీ-4 కార్యక్రమాన్ని ఈ నెల 19 నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. 'బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శుల ఎంపిక ఈ నెల 19 నాటికి పూర్తికావాలి. అత్యున్నత స్థాయిలో ఉన్న పది శాతం మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను అభివృద్ధి చేయాలి. స్ఫూర్తిదాయకమైన సందేశం ఇవ్వాలి. మార్గదర్శుల పేరిట ఎవరికీ బలవంతం చేయొద్దు. పీ-4 కార్యక్రమం అమలుపై మార్గదర్శకాలను సిద్ధం చేశాం. అందులో ప్రజాప్రతినిధులు, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు స్పష్టం చేశాం. మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందంగానే జరగాలి.' అని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా నుంచి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.


రికవరీ.. ఏదీ పురోగతి?

● ఇదీ ఏజెన్సీలో ఉన్నతి, స్త్రీ నిధి రుణాల పరిస్థితి
● ఏళ్లు గడుస్తున్నా.. అంతంతమాత్రంగానే వసూళ్లు
● పట్టించుకోని క్షేత్రస్థాయి సిబ్బంది
● ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విన్నపం

సీతంపేట రూరల్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఎస్సీ, ఎస్టీ మహిళా సభ్యులకు అప్పట్లో ఇచ్చిన ఉన్నతి రుణాలపై పర్యవేక్షణ కొరవడింది. ఏళ్లు గడుస్తున్నా రికవరీలో పురోగతి కనిపించడం లేదు. ఆ రుణాల ద్వారా మహిళలు ఎంత వరకు లాభం పొందారు? ఆర్థిక ప్రయోజనాలు పొందారా? లేదా, ఎంతవరకు తిరిగి చెల్లిస్తున్నారనే అంశాలపై సంబంధిత శాఖ దృష్టి సారించడం లేదు. దీంతో ఉన్నతి రుణాల రికవరీ జరగడం లేదనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. వాస్తవంగా రూ.కోట్లలో రుణాలు తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు ఇంతవరకు చెల్లించకుండా ఉంటారా? అనే అనుమానాలు కూడా లేకపోలేదు. రికవరీ ఎందుకు జరగడం లేదో నిగ్గుతేల్చాలంటే.. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆర్థిక స్వావలంబన కలిగించే దిశగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011-12లో ఉన్నతి రుణాలను పెద్ద ఎత్తున మంజూరు చేసింది. ఈ మేరకు సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఏడు టీపీఎంయూ మండలాల్లో సున్నా వడ్డీ(ఉన్నతి) రుణాలు అందజేశారు. మొత్తంగా 3,047 మంది ఎస్సీఎస్టీ మహిళలకు సుమారు రూ.12.46కోట్లు రుణాలు వెలుగు సంస్థ ద్వారా ఇచ్చారు. అయితే ఈ రుణాలు మహిళా సంఘాల సభ్యులకు అందజేసి నేటికి 13ఏళ్లు గడుస్తున్నా.. ఇంకా సుమారు రూ.8 కోట్లు పైబడి రికవరీ కావల్సి ఉంది. ప్రభుత్వాలు మారినా, ఐకేపీ(ఇందిరా క్రాంతి పథం)లో అధికారులు, కిందిస్థాయి సిబ్బంది మారినా రికవరీలో మాత్రం పురోగతి కనిపించడం లేదు.



సీతంపేట ఐటీడీఏలోని వెలుగు కార్యాలయం

టీపీఎంయూ మండలాల్లో ఇలా..

● ఐటీడీఏ పరిధిలోని గిరిజన, షెడ్యూల్డ్ కులాలు ఎక్కువగా నివసించే సీతంపేట, కొత్తూరు, భామిని, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, మందస టీపీఎంయూ(ట్రైబల్ ప్రాజెక్ట్ మోన టరింగ్ యూనిట్)మండలాల్లో అప్పట్లో సున్నావడ్డీ కింద అధికమొత్తంలో రుణాలు మంజూరు చేశారు.

● సీతంపేట మండలంలో 1091 మంది సభ్యులకు రూ.4.1 కోట్లు, హిరమండలంలో 171మందికి రూ.74లక్షలు, కొత్తూరులో 447మందికి రూ.1.92కోట్లు, మందసలో 401మందికి 1.66కోట్లు, మెళియాపుట్టిలో 262మందికి రూ.1.13కోట్లు, పాతపట్నంలో 166మందికి 64.45లక్షలు, భామినిలో 609మందికి 2.27కోట్లు ఉన్నతి రుణాలను మంజూరు చేశారు. ఎస్సీఎస్టీ మహిళలకు కోట్లలో ఉన్నతి రుణాలు అందజేసినప్పటికీ రికవరీ మాత్రం అంతంత మాత్రంగా ఉండడం వెనుక గల ఆంతర్యమేంటో ఎవరికి అర్థం కావడం

(మిగతా 8వ పేజీలో...)



పశువులను కాపాడి..
సంతతిని పెంచాలని!
● రూ.150కే మేలు జాతి వీర్యం
● ఉచితంగా పశువుల పిండ మార్పిడి

6లో

సవర కళను అభివృద్ధి చేస్తాం

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సవర కళ అభివృద్ధికి కృషిచేస్తామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పీఎంఆర్‌సీలో ఏపీ టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో సవర ఆర్ట్స్‌పై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గిరిజన చిత్రకళాకారులకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. ఆయా చిత్రకళలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. కళాకా రులను అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా వేడుకలు

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తామని ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 9న ఐటీడీఏ వేదికగా నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లపై సెక్టోరియల్ అధికారులు, పోలీస్ సిబ్బందితో సమీక్షించారు. ఆదివాసీ దినోత్సవం రోజున నిర్వహించనున్న శోభాయాత్రలో గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా అందరి వేషధారణలు ఉండాలన్నారు. గిరిజన నృత్యాలతో ఊరేగింపు ఉంటుందన్నారు. ఐటీడీఏ ప్రధాన గేటు వద్ద ఉన్న అడవితల్లి విగ్రహానికి రంగులు వేయాలని ఆదేశించారు. అన్ని శాఖలకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని, వేడుకలను వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

పది చోరీ కేసుల్లో
నిందితుడి అరెస్ట్
● పది తులాల బంగారం, బైక్ స్వాధీనం

7లో

త్వరలో మొబైల్ రైతుబజార్లు

6లో

నిధులు రాక.. నిర్మాణాలు జరగక

8లో

పైడితల్లికి పూలతో అలంకరణ



6లో



వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సెల్ టవర్ల పనులు వేగవంతం

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సెల్ టవర్ల పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'టవర్లు ఏర్పాటు చేయబోయే ప్రాంతాలకు మెటీరియల్ తీసుకెళ్లేలా రహదారి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. దీనికోసం ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలి. అతి ముఖ్యమైన రహదారి పనులను గుర్తించి నిధులను మంజూరు చేయాలి. అదే విధంగా అటవీ ప్రాంతంలో అనుమతులు కోసం వారంలో ప్రతిపాదనలు పంపాలి.' అని తెలిపారు.

అక్రమ ప్రైవేట్ క్లినిక్‌లపై నిరంతర చర్యలు

ప్రజారోగ్య రక్షణలో భాగంగా జిల్లాలోని అక్రమ ప్రైవేట్ మెడికల్ క్లినిక్‌లు, ప్రాక్టీషనర్లపై నిరంతరంగా చర్యలు కొనసాగాలని కలెక్టర్ ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు, స్టేషన్ హౌస్ అధికారులు, తహసీల్దార్లతో ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా.. నిబంధనలు పాటించ కుండా నడిపే క్లినిక్‌లను వెంటనే సీజ్ చేయాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ చికిత్స వరకే పరిమితం చేయాలని సూచించారు. ఎటువంటి ఇంజక్షన్లు కూడా వాడకూడదన్నారు. అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నకిలీ ఎరువులతో జాగ్రత్త
● కొనుగోలు విషయంలో అవగాహన అవసరం
● రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి

6లో

లోక్‌అదాలత్‌లో
బీమా కేసుల పరిష్కారం
● ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయాధికారి బబిత

6లో

మహిళల చేతికి డ్రోన్లు

● కేంద్రం 'నమో డ్రోన్ దీదీ'కి శ్రీకారం
● స్వయం సహాయక సంఘాలకు రాయితీపై అందజేత



రాజాం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. స్వయం సహాయక సంఘ సభ్యుల చేతికి డ్రోన్లను అందించనుంది. కేంద్రం 'నమో డ్రోన్ దీదీ' కార్యక్రమం కింద సాంకేతికత, చదువు తదితర అంశా లపై అవగాహన ఉండి.. వ్యవసాయం చేసేవారికి వీటిని అందించనున్నారు. ప్రస్తుతం స్వయం సహాయక సంఘ సభ్యుల ఎంపిక జరుగుతోంది. డ్రోన్ విలువ రూ.10 లక్షల వరకూ ఉంటుంది. కానీ రూ.2 లక్షలకే అందిస్తారు. లబ్ధిదారులు చెల్లించాల్సిన రూ.2 లక్షలను కూడా బ్యాంకు రుణంగా అందిస్తుంది. ఎంపికైన మహిళలకు 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. వారి కుటుంబ సభ్యుడికి మెకానిక్, డ్రోన్ అసిస్టెంట్ విధులపై 5 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో 4.26 లక్షల ఎకరాలు, రబీలో 2.59 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. మొత్తం 3.56 లక్షల మంది రైతులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో మూడొంతుల మంది చిన్నసన్నకారు రైతులే. వీరి కుటుంబాల్లో స్వయం సహాయక సభ్యులు ఉంటారు. అటువంటి వారంతా డ్రోన్లు పొందవచ్చు.

జ్వరాలు వదల్లే!

● ఏజెన్సీ ప్రాంతాల్లో పెరిగిన తీవ్రత
● చినమేరంగి, జియ్యమ్మవలస ఆసుపత్రులు కిటకిట
● వనజ గ్రామం నుంచి అత్యధికంగా వస్తున్న పీడితులు
● వైద్య శిబిరం నిర్వహిస్తున్నా.. అదుపులోకి రాని పరిస్థితి
● కలుషితనీరు, పారిశుధ్య లోపమే కారణమంటున్న గిరిజనులు



చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

జియ్యమ్మవలస, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):ఏజెన్సీ పంచాయతీల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటికి ఒకరిద్దరు చొప్పున మంచం పట్టారు. సంబంధిత పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందిస్తు న్నప్పటికీ జ్వరాలు తగ్గుముఖం పట్టడం లేదు. దీనికి ప్రధాన కారణం కలుషిత తాగునీరు, పారిశుధ్య లోపమేనని గిరిజనులు వాపోతున్నారు. ప్రధానంగా అర్నాడ పంచాయతీలోని వనజ గ్రామంలో పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ సుమారు 70 మంది జ్వరాలతో బాధపడుతున్నారు. ఆ పంచాయతీలోని కొత్తవలస, కొత్తగూడతో కూడా రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం ఆయా ప్రాంతా లకు చెందిన 48 మంది చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. జియ్యమ్మవలస పీహెచ్‌సీలోనూ రోజుకు పదుల సంఖ్యలో జ్వరపీడితులు తరలివస్తున్నారు. ఈ రెండు చోట్ల వైద్యాధికారులు, సిబ్బంది రోగులకు తగు చికిత్స అందిస్తూనే ఉన్నారు. జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జగదీష్ ఆధ్వర్యంలో వనజ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. అయితే ఈ గ్రామంలో

(మిగతా 8వ పేజీలో...)

పశువులను కాపాడి.. సంతతిని పెంచాలని!

- రూ.150కే మేలుజాతి వీర్యం
- జిల్లాకు 15 లక్షల డోసులు
- ఉచితంగా పశువుల పిండ మార్పిడి
- పాడి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

రాజాం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):

కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పాడి పశువులను కాపాడడంతో పాటు వాటి వృద్ధిపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఆడ పెయ్యిల సంతతిని మరింతగా పెంచాలని భావిస్తోంది. మేలుజాతికి సంబంధించిన వీర్యాన్ని రూ.150కు అంది స్తోంది. ఇప్పటికే పంపిణీని ప్రారంభించింది. ఇదివరకు రూ.500కు అందిస్తుండగా మరింత మంది లబ్ధి పొందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ధర తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వీర్యానికి సంబంధించి 15 లక్షల ఇంజెక్షన్లను అందు బాటులోకి తెచ్చారు. అన్ని పశువుల ఆస్పత్రులు, రైతుసేవా కేంద్రాల్లో వీటిని పొందే వెసులుబాటు కల్పించింది కూటమి ప్రభుత్వం.

● ఆవుల మృత్యువాతతో..

జిల్లాలో సంతానోత్పత్తికి సంబంధించి ఉపయోగపడే పాడి పశువులు 3.24 లక్షల వరకూ ఉన్నట్టు అంచనా. వీటికి మేలుజాతి వీర్యం ఇంజక్షన్లు వేస్తే పాడి అభివృద్ధికి అవకాశం ఉంటుంది. వాస్తవానికి 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ అప్పట్లో పాడి పశువుల అభివృ ద్ధికిగాను ఇతర ప్రాంతాలకు చెందిన మేలు జాతి ఆవులను అందించింది. సంతానోత్పత్తి సమయంలో ఆవులు చాలా వరకూ అనారోగ్యానికి గురయ్యాయి. మృత్యువాత పడ్డాయి. ఇక్కడి వాతావరణానికి తట్టుకోలేక మృతి చెందినట్టు నిపుణులు స్పష్టం చేశారు. అందుకే ఇప్పుడు మేలుజాతి వీర్యం అందించేందుకు నిర్ణయించారు. జిల్లాలో పాల అభివృద్ధి పెంచడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా సాంకేతికతో అభివృద్ధి చేసిన మేలు జాతి వీర్యాన్ని అందిస్తోంది. దీనికి సంబంధించిన బాధ్యతలను పశు వైద్యాధికారులు, వెటర్నటీ సచివాలయ కార్యదర్శులు, గోపాలమిత్రలు చూసుకుంటారు.

● రూపాయి ఖర్చు లేకుండా..

పాడి అభివృద్ధి విషయంలో టీడీపీ ప్రభుత్వం ముందు ఉంటోంది. సీజన్ల వారీగా శిబిరాల నిర్వహణ, ఇతరత్రా విషయాల్లో ఎప్పటికప్పుడు చొరవ చూపు తోంది. ఇప్పటికే నేరుగా పశువులకు పిండ మార్పిడి ప్రక్రియను ఉచితంగా చేపడుతోంది. ఎంబ్రోగా పిలిచే ఈ ప్రక్రియకు రూ.5 వేలు ఖర్చు అవుతుంది. కానీ ప్రభుత్వం మాత్రం పాడి రైతులకు భారంగా ఉండకూడదనే ఉద్దేశంతో ఉచితంగా అందిస్తోంది. ఈ పిండ మార్పిడికిగాను జిల్లాలో ఇద్దరు పశు వైద్యాధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పశువులకు పిండ మార్పిడికి అవసరమైన పాడి రైతులు దరఖాస్తు చేసుకుంటే అందించేందుకు పశుసంవర్థక శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారు. జెర్సీ, ఒంగోలు లాంటి జాతుల లక్షణాలు పశువులకు శతశాతం రావాలంటే ఏడు ఈతల వరకూ చూడాల్సిందే. కానీ పిండ మార్పిడితో శతశాతం లక్షణాలు పశువులకు లభిస్తాయి.

రైతులు వినియోగించుకోవాలి..

జిల్లా వ్యాప్తంగా మేలు జాతి వీర్యం పంపిణీని జూలై 1 నుంచి ప్రారంభించాం. రూ.150కే డోసు అందిస్తున్నాం. జిల్లాకు 15 వేల ఇంజెక్షన్లు వచ్చాయి. మండల పశు వైద్య కేంద్రాలు, పాలిక్లినిక్‌లు, రైతు సేవా కేంద్రాల్లో సైతం అందుబాటులో ఉంటాయి. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-వైవీ రమణ, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి, విజయనగరం


మేలుజాతి ఆవు, దూడ


పైడిమాంబను పూలతో అలంకరించిన దృశ్యం


వనంగుడిలో...

పైడితల్లికి పూలతో అలంకరణ

విజయనగరం కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారిని మంగళవారం పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. చదురుగుడి ఆలయ ప్రాంగణంతో పాటు అమ్మవారి గర్భగుడిని పూలతో తీర్చిదిద్దారు. ప్రత్యేక అలంకరణ అనంతరం అమ్మవారి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. శ్రావణ మాస ద్వితీయ మంగళవారం సందర్భంగా ప్రాతఃకాల సమయం నుంచి పంచామృతాభిషేకాలు చేశారు. రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న పైడిమాంబ వనంగుడిని కూడా పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరలో మొబైల్ రైతుబజార్లు

- బొబ్బిలిలో రైతుబజారుకు స్థల సేకరణ
- మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్


విలేకరులతో మాట్లాడుతున్న ఏడీ రవికిరణ్

బొబ్బిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధానమైన పట్టణాల్లో మొబైల్ రైతుబజార్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్ తెలిపారు. బొబ్బిలి ఏఎంసీకి మంగళవారం విచ్చేసిన సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గల 8 ఏఎంసీలకు పాలకవర్గాలను ప్రభుత్వం నియమించిందన్నారు. సగానికి పైగా పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. మిగిలినవి త్వరలో పూర్తవుతాయని చెప్పారు. నియోజకవర్గానికి ఒక రైతుబజారును ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటుకు స్థల సేకరణ ప్రక్రియ జరుగుతోందన్నారు. మున్సిపాలిటీలు, ఇతర ముఖ్యపట్టణాల్లో మొబైల్ రైతు బజార్ల ఏర్పాటు కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలోని ఏఎంసీలన్నిటినీ రైతుల సేవలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. నిధుల లభ్యతను బట్టి రోడ్లు, భవనాలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. రైతుల నుంచి పంటల ఉత్పత్తులను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని వివరించారు. ఎరువులు, విత్తనాల వంటివి కూడా మార్క్‌ఫెడ్ ద్వారానే సరఫరా చేస్తారు. రైతులకు కావాల్సిన పంటల నిల్వలకు గోదాములు, శీతలగిడ్డంగులు వంటివి అభివృద్ధి చేస్తామని ఏడీ తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎం.కాశేశ్వరరావు, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


ముత్యాలమ్మ తల్లికి నాణాలతో అలంకరణ


తోగాలమ్మకు నోట్లతో ఇలా...

కరెన్సీ నోట్లు.. నాణాలతో అలంకరణ

భోగాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గుడివాడ గ్రామ దేవతలైన ముత్యాలమ్మ తల్లి, తోగాలమ్మ తల్లి విగ్రహాలను భక్తులు మంగళవారం నగదుతో అలంకరించారు. ముత్యాలమ్మ విగ్రహానికి సుమారు రూ.25 వేల విలువ గల నాణాలతో అలంకరించారు. తోగాలమ్మ విగ్రహానికి రూ.50వేల విలువ గల నోట్లతో అలంకరించారు. ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అమ్మవారి విగ్రహాలకు భక్తులు ప్రతి వారం అలంకరించి... విశేష పూజలు చేస్తారు. మంగళవారం అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


మాట్లాడుతున్న ప్రధాన న్యాయాధికారి బబిత

లోక్‌అదాలత్‌లో బీమా కేసుల పరిష్కారం

విజయనగరం క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మోటారు ప్రమాద బీమా కేసులన్నింటిని సెప్టెంబరు 13న జరుగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించాలని ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత సూచించారు. జిల్లా కోర్టు హాలులో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉన్న ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, సంబంధిత న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. మోటారు ప్రమాద బీమా కేసులకు సంబంధించి సెప్టెంబరు 13న జరగబోయే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని సంబంధిత కంపెనీ అధికారులకు సూచించారు. దీని వల్ల సమయం ఆదా అవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్, వివిధ బీమా కంపెనీల అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్స్ పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

- బోగస్ ఏజెన్సీలు, సంస్థల ప్రలోభాలకు లొంగవద్దు
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిప్లమో, ఇంజనీరింగ్, డిగ్రీ, టెక్నికల్ గ్రాడ్యుయేట్లను లక్ష్యంగా చేసుకుని విదేశాల్లో ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని నమ్మించి మోసాలకు పాల్పడేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. నమ్మించి మోసాలకు పాల్పడే ఏజెన్సీలు, ముఠాల పట్ల ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇటీవల కాలంలో నిరుద్యోగులకు విదేశాల్లో ఉపాధి కల్పిస్తామని, రూ.లక్షల్లో జీతాలు చెల్లిస్తామని ఆశావాహుల నుంచి పెద్దమొత్తంలో నగదు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నట్టు కొన్ని సంఘటనలు కొన్ని జిల్లాల్లో వెలుగు చూశాయన్నారు. యువత ఆసక్తిని గమనించి కొన్ని ఏజెన్సీలు, ముఠాలకు సంబంధించిన వ్యక్తులు నిరుద్యోగులను ఆకర్షించేందుకు కొన్ని సందేశాలను వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లలో పంపి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మిస్తారన్నారు. చదువుతో సంబంధం లేని ఉద్యోగాల్లో నియమించి వారితో సైబర్ నేరాలు, ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేయిస్తారని హెచ్చరించారు. ఈ తరహా ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తి కనబరచని ఉద్యోగుల నుంచి పాస్‌పోర్టులు, ఇతర విలువైన డాక్యుమెంట్లు, డబ్బులను స్వాధీనం చేసుకుని వారిని గుర్తు తెలియని ప్రాంతాలకు తరలిస్తారని తెలిపారు. అక్కడ చీకటి గదుల్లో నిర్బంధించి... శారీరక, మానసిక వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటువంటి బోగస్ ఏజెన్సీలు, ముఠాల ఉచ్చుల్లో చిక్కుకోవద్దని హెచ్చరించారు.


ఎస్పీ వకుల్ జిందాల్

కొత్త ప్రాజెక్టులను రూపొందించండి: డీఈవో


మాట్లాడుతున్న డీఈవో మాణిక్యం నాయుడు

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సైన్సుపై ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఆలోచనలతో వినూత్న ప్రాజెక్టులు రూపొందించాలని డీఈవో మాణిక్యంనాయుడు సూచించారు. 'ఇన్‌స్పైర్' కార్యక్రమంలో భాగంగా స్థానిక పీఎస్ఆర్ స్కూల్‌లో మంగళవారం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రతి హైస్కూల్ 5 ప్రాజెక్టులు, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు ప్రాజెక్టులు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇన్‌స్పైర్ పోస్టర్, ఏపీవోఎస్ఎస్ ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను డీఈవో ఆవిష్కరించారు. ఉప విద్యా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ సన్యాసినాయుడు, డీసీఈబీ సన్యాసిరాజు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులతో జాగ్రత్త

- కొనుగోలు విషయంలో అవగాహన అవసరం
- రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పొలం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారి మజ్జి శ్యామ్ సుందర్ తెలిపారు. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని రైతులు ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగిస్తున్నారు. అన్నదాతల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు నకిలీ ఉత్పత్తులను అంటగట్టే అవకాశముందని... అప్రమత్తంగా ఉండకపోతే మోసపోయే ప్రమాదం ఉందని ఆయన రైతులకు హెచ్చరించారు. రసాయన ఎరువులు అంటే కేవలం యూరియా, డీఏపీ మాత్రమేనని... వాటి వల్లనే పంటల దిగుబడులు పెరుగుతాయని అనుకోవడం తప్పు అని చెప్పారు. యూరియా, డీఏపీ స్థానంలో 14.35.14.28 లేదా 20.20.13 (నానో యూరియా) కూడా వాడచ్చని సూచించారు.

దళారుల వద్ద మందులు కొనుగోలు చేయవద్దు..

దళారుల వద్ద నిషేధిత మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. కొందరు ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు దిగుబడి ఎక్కువగా వస్తుందని నమ్మించి అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు అంటగట్టే అవకాశం ఉంది. అనుమతి లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదని, తక్కువ ధరకే ఇస్తున్నారని కొనుగోలు చేసి వినియోగిస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బ తింటుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

రశీదు తీసుకోవాలి..

ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా దుకాణ యజమాని సంతకంతో కూడిన రశీదు తీసుకోవాలి.


బొబ్బిలిలో పురుగు మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో శ్యామ్‌సుందర్ (ఫైల్)


కమ్మవలసలో పొలం పనుల్లో...

ముఖ్యంగా విత్తనాలకు సంబంధించిన సంచుల సీళ్లు తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా నకిలీలపై ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేసి రైతులకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుంది.

లైసెన్సులు రద్దు చేస్తాం..

దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వాటి లైసెన్సుల రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణం పేరుతో పాటు యజమాని సంతకంతో కూడిన బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి. పురుగు మందులు తీసుకునేటప్పుడు డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. చదువు రాని వారు తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తర్వాతనే కొనుగోలు చేయాలి. వ్యవసాయాధికారుల సూచన ప్రకారమే మందు పిచికారీ చేయాలి. లేకుంటే పంట దెబ్బతినే ప్రమాదం ఉంది.

-శ్యామ్‌సుందర్, మండల వ్యవసాయ అధికారి, బొబ్బిలి

ఘనంగా లక్ష సిందూర అర్చన

గజపతినగరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రావణ శుద్ధ ఏకాదశి సందర్భంగా లక్ష సిందూర అర్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రామకృష్ణ పర్యవేక్షణలో వేద పండితులు ఉదయం 8 గంటల నుంచి పూజలు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొందరు భక్తులు స్వచ్ఛందంగా ఆలయం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేకువజాము నుంచి పాలాభిషేకం, తులసీదళార్చన చేశారు.


పూజలు చేస్తున్న అర్చకులు

పీహెచ్‌సీ తనిఖీ

గంట్యాడ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పెద మజ్జిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిణి జీవనరాణి మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో ప్రసవాలు, ఈహెచ్‌ఆర్ పెంచాలని సూచించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

క్షయ నివారణకు కృషి చేయాలి

లక్కవరపుకోట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): క్షయ నివారణకు అందరూ కలిసి పనిచేయాలని జిల్లా టీబీ కోఆర్డినేటర్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన ఆశా డే సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. దీర్ఘకాలిక దగ్గుతో ఉన్నలవారిని వెంటనే కఫం పరీక్షకు పంపాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యుడు అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 12న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్నవారికి తప్పనిసరిగా మాత్రలు అందజేయాలని తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు స్వీయ రక్షణ అవసరం

లక్కవరపుకోట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బాలికలకు స్వీయ రక్షణ అవసరమని ఎస్.కోట రూరల్ సీఐ ఎల్.అప్పలనాయుడు అన్నారు. జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఎస్ఐ నవీన్‌పడాల్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు శారీరక ధారుడ్యంతో పాటుగా మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణం, వసతి గృహాలను తనిఖీచేశారు.

పింఛన్ల తొలగింపు తగదు

గజపతినగరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అర్హులకు పింఛన్లు తొలగించడం తగదని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు రాజకీయ దురుద్దేశంతో పింఛన్లు తొలగించారని ఆయన ఆరోపించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దీనికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పలువురికి అన్నదాత సుఖీభవ డబ్బులు అందలేదని, ఎరువులు కూడా సకాలంలో అందడం లేదన్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస విత్తనాలు పంపిణీకి సిద్ధం

వేపాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు పంపిణీ చేసేందుకు పశుగ్రాస విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల పశు వైద్యాధికారి కోరాడ గాయత్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేపాడ మండలానికి గాను 300 కిట్లు, 1500 కేజీలు(1.5 టన్నుల) పశుగ్రాస విత్తనాలు సీఎస్‌హెచ్ 24 ఎంఎఫ్ జొన్నరకం గడ్డి విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఒక్కొక్క కిట్ ధర 5 కేజీలు కాగా.. దాని పూర్తి ఖరీదు రూ.460 కాగా, రూ.345 రాయితీ పోను రైతులకు రూ.115లకే అమ్ముతామని తెలిపారు. ఈ పశుగ్రాస విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

గుర్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకురాలు సుధారాణి కోరారు. గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం ఆమె ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సమావేశమయ్యారు. తమకు ఇచ్చిన సెల్‌ఫోన్లు పోషణ్ ట్రాకర్, బాల సంజీవని యాప్ అమలుకు సపోర్టు చేయడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. ప్రాజెక్టు లీడర్ ఆర్.వరలక్ష్మి, సరళ పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్ చర్యల్లో భాగంగా వివిధ చెరువుల్లో మంగళవారం గంబూషియా చేపలను విడిచిపెట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డా.సాంబమూర్తి, మలేరియా అధికారి వై.మణితో కలిసి చేపలను విడిచిపెట్టారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమల వృద్ధి అధికంగా ఉంటుందని, వాటి నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే చెరువులు, కుంటలు, నీటినిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ విడిచి పెట్టామన్నారు.

ధారగంగమ్మ దివ్యపాదాల ప్రతిష్ఠ

శృంగవరపుకోట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట ధారగంగమ్మ తల్లి దివ్యపాదాల ప్రతిష్ఠ మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్టణానికి చెందిన బంటుమిల్లి అప్పన్న కుమారులు అప్పలరాజు, శంకరరావులు ఈ పాదాలను, సింహద్వారాన్ని కట్టించారు. దీన్ని మంగళవారం స్థానికుడు డీకే నాయుడుతో కలిసి ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. యలమంచిలి ఈశ్వరరావు, కొమ్ముజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

సంతకవిటి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రాజాం వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లూరు గణేష్, పీఏసీఎస్ చైర్మన్ చెలికాని మహేష్‌కుమార్, టీడీపీ మండల నాయకుడు సమతం శ్రీనివాసరావు కోరారు. సంతకవిటి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.సుదర్శన్‌రావును వారు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆ మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- కనిపించని సూచిక బోర్డులు
- జంగిల్ క్లియరెన్స్ చేయని వైనం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు





గోళ్లవలస, వాసుదేవపట్నం గ్రామాల మధ్య ప్రమాదకర మలుపు, మోదుగులపేట సమీపంలో..

సంతకవిటి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆ దారిలో అనేక మలుపులు.. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు.. కానరాని సూచిక బోర్డులు.. జంగిల్ క్లియరెన్స్ చేయని వైనం.. ఇదీ మండలంలోని పలు రహదారుల దుస్థితి. రాజాం నుంచి సంతకవిటి మీదుగా హొంజరాం వెళ్లే ప్రధాన రహదారి, సంతకవిటి నుంచి పొందూరు మండలానికి వెళ్లే రహదారిలో మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. ముఖ్యంగా మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ వద్ద భారీ మలుపు దర్శనమిస్తుంది. అలాగే గోళ్ళవలస, వాసుదేవపట్నం గ్రామాల మధ్య, గుళ్లసీతారాంపురం, తాలాడ గ్రామాల మధ్య, సంతకవిటి నుంచి హోంజరాం గ్రామానికి వెళ్లే మార్గంలో పోతులజగ్గుపేట గ్రామ సమీపంలో భారీ మలుపులు ఉన్నాయి. సంతకవిటి-పొందూరు ప్రధాన రహదారిలో మల్లయ్యపేట, మిర్తివలస మధ్య ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ మలుపుల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడం, సూచక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాలలో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే తాలాడ సెంటర్ నుంచి మోదుగులపేట గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి కూడా అనేక మలుపులతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

రాజాం నుంచి హొంజరాం వెళ్లే ప్రధాన రహదారిలో మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ మలుపుల వద్ద రాత్రి సమయాల్లో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

- కొండాడ ఉమామహేశ్వరరావు, గోళ్లవలస

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలి

మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కనీసం మలుపులు ఉన్న చోట జంగిల్ క్లియరెన్స్ చేయాలి. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కొమ్ము అప్పలనాయుడు, మోదుగులపేట

గ్రామాభివృద్ధికి సహకరించాలి



ఎమ్మెల్యే నాగమాధవికి వినతిపత్రం అందజేస్తున్న కొవ్వాడ గ్రామస్థులు

భోగాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాభివృద్ధికి సహకరించి, నిధులు మంజూరు చేయాలని పూసపాటిరేగ మండలం కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు ఎమ్మెల్యే లోకం నాగమాధవిని కోరారు. ఈ మేరకు మంగళవారం ముంజేరు గ్రామ సమీపంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి, వినతిపత్రం అందజేశారు. కొవ్వాడ అగ్రహారంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కోట్ల సత్యంనాయుడు, రామకృష్ణ, తవటినాయుడు పాల్గొన్నారు.

పౌరసేవలు మరింత సులభతరం



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పౌర సేవలు మరింత సులభతరం చేసేందుకు వాట్సాప్ గవర్నెన్స్ విధానం ప్రవేశపెట్టిందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ విధానం, మనమిత్ర యాప్‌పై చేపట్టిన ర్యాలీని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు ఈ నూతన విధానం అవలంబిస్తున్నదన్నారు. ఇందు కోసం ప్రత్యేక వాట్సాప్ నెంబరు 95523 00009 ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మేసేజ్ పెట్టినట్టయితే, ప్రభుత్వ పరంగా ప్రజలకు అందిస్తున్న సేవలు అవసరమైన సమాచారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ అప్పలరాజు, ఏసీపీ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

చీపురుపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేసి, ప్రజల ఆరోగ్యానికి రక్షణగా ఉండాలని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ కోరారు. మంగళవారం ఆమె చీపురుపల్లిలోని తన కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తుండాలన్నారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ స్థాయిలో సేవలందిస్తున్న గ్రామీణ నీటి సరఫరా, సచివాలయ, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు సమన్వయంతో పని చేసి, ప్రజల ఆరోగ్యం పట్ల పూర్తి బాధ్యతగా మెలగాలని కోరారు. జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఎంపీడీవో ఐ.సురేష్, ఏవో టి.ప్రవీణ్, అనంతం, శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

కళాశాల సందర్శన

సంతకవిటి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో శివాల తవిటినాయుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వ కళాశాలలో ప్రైవేట్ కళాశాలకు దీటుగా ఐపీఈతో పాటు, ఎంసెట్ కోచింగ్‌ను అందిస్తామని తెలిపారు. ఈ కోచింగ్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం కళాశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.భవాని, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం విజయనగరం మండలం పినవేమలి, రాకోడు, జొన్నవలస గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలవుతున్నాయని చెప్పారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగార్జున

శృంగవరపుకోట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు బొడ్డవర పంచాయతీ పరిధిలోని ఇందుకూరి రిసార్ట్స్‌లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం డీసీసీబీల్లో పని చేస్తున్న యువ అసిస్టెంట్ మెనేజర్స్, మేనేజర్స్‌కు యువ నాయకత్వం (యంగ్ లీడర్) పేరిట కార్యక్రమం జరగనుంది. దీనిపై మంగళవారం ఆయన స్థానిక రిసార్ట్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్కో, నాబార్డు ఆధ్వర్యంలో మెనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ శిక్షణను బిర్డ్ లక్నో ఇస్తుందన్నారు. నాయకత్వ లక్షణాలను మెరుగుపరు చుకోవాలని సూచించారు. బిర్డ్ శిక్షకులు శిఖా త్రిపాఠి, డీసీసీబీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు, అప్కోబ్ జీఎం పీఎస్ మణి షేక్ అఫ్సరజహాన్ పాల్గొన్నారు.

రైతులపై వైసీపీ నాయకులది కపట ప్రేమ

చీపురుపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు రైతులపై కపట ప్రేమను ఒలకబోస్తున్నారని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఫసల్ బీమా ప్రీమియం కింద రూ.200కోట్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, గత వైసీపీ ప్రభుత్వం ఎగనామం పెట్టిందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ మంత్రి పార్లమెంటులో ప్రకటించారని తెలిపారు. ఆ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించాల్సి వచ్చిందన్నారు. రైతుల కోసం ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆర్ఎస్‌కేల ద్వారా 5399.96 మెట్రిక్ టన్నుల యూరియా, పీఏసీఎస్‌ల ద్వారా 1602.72 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని చెప్పారు. అదే విధంగా సుమారు ఏడు వేల మెట్రిక్ టన్నుల డీఏపీ కూడా పంపిణీ చేశామన్నారు. అధికారంలో ఉన్నంత కాలం రైతుల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోని వైసీపీ నాయకులు ఇప్పుడు వారిపై కపట ప్రేమను చూపిస్తున్నారని నాగార్జున విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే, తమ ప్రభుత్వం వ్యవసాయ శాఖను అప్రమత్తం చేసి, రైతులకు కావాల్సిన సౌకర్యాలను కల్పించిందని వివరించారు.

గిరిజన సర్పంచ్‌నని అవమానిస్తున్నారు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తాను గిరిజన సర్పంచ్‌నని తమ పంచాయతీ కార్యదర్శి అవమానకరంగా ప్రవరిస్తున్నారని బొడ్డవర సర్పంచ్ దేవాపురపు మీనా ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం గ్రామ సచివాలయంలో తన పంచాయతీ ప్రజలతో నేలపై కూర్చుని నిరసన చేపట్టారు. పంచాయతీకి నూతన పింఛన్లు వస్తే తనకు చెప్పలేదని, తనను రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్న వారితో పంపిణీ చేయించారని తెలిపారు. అదేవిధంగా తమ ఎంపీటీసీ.. తాను కనిపించడం లేదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి తన మనోభావాలు దెబ్బతిస్తున్నారన్నారు. నాలుగేళ్ల కిందట తనకు బ్రెయిన్‌స్ట్రోక్ వస్తే విశాఖలో చికిత్స నిమిత్తం ఉంటున్నానని తెలిపారు. పంచాయతీ పనులు చూసుకుంటున్నాని చెప్పారు. కార్యదర్శి తన ఉద్యోగం మాని రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ● పంచాయతీ కార్యదర్శి రామునాయుడు వివరణ కోరగా.. తాను ఇన్‌చార్జిగా వచ్చిన నాటి నుంచి సర్పంచ్ తండ్రికి చెబుతూ పనులు చేస్తున్నామని, పింఛన్లు విషయం ఆయనకే చెప్పానన్నారు.

ఏఎన్ఎంల బదిలీల్లో మార్గదర్శకాలు పాటించరా?

రేగిడి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆర్‌సీహెచ్ ఏఎన్ఎంల బదిలీల్లో సరైన మార్గదర్శకాలు పాటించకపోవటం, సిబ్బంది పనిచేసే చోట డెప్యుటేషన్లు అనుమతించటం, కక్షపూరిత చర్యలతో సిబ్బందిపై బదిలీవేటు వేయటం ఎంతమాత్రం సరికాదని టీడీపీ మండల నాయకులు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం బూరాడ మాజీ సర్పంచ్ వి.నాగభూషణరావు, టీడీపీ నాయకులు గురవాన ధనంజయ్‌రావు, కేత శంకర్రావు, శ్రీరాములు తదితరులు బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి చలమయ్యను కలిసి అభ్యంతరాలు లేవనెత్తారు. బూరాడ పీహెచ్‌సీ హెడ్‌క్వార్టర్‌లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టు భర్తీ కాకపోయినా, అక్కడ పనిచేస్తున్న ఆర్‌సీహెచ్-2 ఏఎన్ఎంను వేరేచోటకు బదిలీ చేయటంపై నాయకులు తప్పుపట్టారు. ఏ ప్రాతిపదికన ఆర్‌సీహెచ్ ఏఎన్ఎంలను బదిలీ చేశారని, మండలంలో ముగ్గురు ఆర్‌సీహెచ్ ఏఎన్ఎంలు పనిచేస్తే ఇద్దరికి బదిలీ ఉత్తర్వులు ఇవ్వటం, పైగా హెడ్‌క్వార్టర్‌లో పోస్టు భర్తీ చేయకపోయినా, ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్‌సీహెచ్-2ను బదిలీ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని వైద్యాధికారిని ప్రశ్నించారు. దీంతో ఆయన మాట్లాడుతూ డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ఇలా చేశామని చెప్పుకొచ్చారు. దీనిపై జిల్లా స్థాయిలో పోరాడుతామని, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని టీడీపీ నాయకులు తెలిపారు. వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

ఆశా వర్కర్లకు జాబ్‌చార్టు అమలు చేయాలి

రాజాం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కచ్చితమైన జాబ్‌చార్టు అమలు చేయాలని ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి బి.సుధారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా మంగళవారం పొగిరి పీహెచ్‌సీలో మండల ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈనెల 17న బొబ్బిలి లోకబంధు రెసిడెన్సీలో నిర్వహించనున్న ఆశా వర్కర్ల యూనియన్ 4వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

- ట్రూ ఆప్ చార్జీలు ఎత్తివేయాలి
- జిల్లా వ్యాప్తంగా వామపక్షాలు, ప్రజా సంఘాల ధర్నా

స్మార్ట్‌మీటర్లను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి, ప్రజలను మోసగించారని వామపక్ష నాయకులు ఆరోపించారు. విద్యుత్‌భారాలకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం, ఇతర ప్రజా సంఘాలు, ప్రజావేదిక ఆధ్వర్యంలో మంగళవారం విజయనగరం జిల్లా వ్యాప్తంగా ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ధర్నా చేశారు. ట్రూ అప్ చార్జీలు ఎత్తివేయాలని కోరారు. ఇళ్ల, అపార్టుమెంట్లలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు వస్తే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. **(ఆంధ్రజ్యోతి బృందం)**



విజయనగరం టౌన్: ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నేతలు



చీపురుపల్లి: సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు



గజపతినగరం: సబ్ స్టేషన్ వద్ద నిరసన చేస్తున్న వామపక్ష నాయకులు

పది చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- 10 తులాల బంగారం, ద్విచక్ర వాహనం స్వాధీనం

బెలగాం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పది చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న తామడ సంతోష్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ గోవిందరావు తెలిపారు. మంగళవారం పార్వతీపురంలో సీఐ గోవిందరావు విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. జియ్యమ్మవలస మండలంలోని బట్లభద్ర గ్రామానికి చెందిన సంతోష్ బలిజిపేట మండలంలోని సంతతోట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. పార్వతీపురం రూరల్ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లతో పాటు కురుపాం పోలీస్ స్టేషన్‌లోని పది కేసుల్లో ముద్దాయిగా గుర్తించారు. బొబ్బిలిలో ద్విచక్ర వాహన చోదకుడికి లిఫ్ట్ అడిగి మధ్యలో మద్యం తాగించి ద్విచక్ర వాహనం దొంగిలించాడు. సంతోష్ నుంచి పది తులాలు బంగారం, రూ.13 వేలు నగదు, ద్విచక్ర వాహనం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంతోష్‌కు గతంలో నేర చరిత్ర ఉంది. ఈ కేసును ఛేదించిన సీసీఎస్ సీఐ, ఎస్ఐలు అప్పారావుకు, సూర్యారావు, ఎస్ఐలు సింహాచలం, నీలకంఠం, సంతోషి కుమారి, రాజేష్, సీసీఎస్ హెచ్‌సీ నారాయణ, పీసీ ఉదయ్‌లను అభినందించారు.

పైశాచిక గురువు రిమాండుకు తరలింపు

భోగాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చిన్నారిపై పైశాచికంగా ప్రవర్తించిన ట్యూషన్ ఉపాధ్యాయుడు అయిన విజయనగరం కంటోన్మెంట్‌కు చెందిన బూర్ల విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ కె.దుర్గాప్రసాదరావు మంగళవారం తెలిపారు. ఎనిమిదేళ్ల బాలిక ముందు అసభ్యకరంగా ప్రవర్తించి.. భయాందోళనకు గురి చేశాడని, దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు. ఈ మేరకు విజయ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు.

గంజాయితో యువకుడు అరెస్టు

విజయనగరం క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పడాలపేట గ్రామానికి చెందిన పిన్నింటి తేజేశ్వర్‌ను నారాయణపురం సమీపంలోని సీఆర్ నగర్ జంక్షన్‌లో కేజీ 160 గ్రాముల గంజాయితో వెళ్తుండగా పట్టుకున్నామని విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ చెప్పారు.

రైలు నుంచి జారిపడి ఒకరికి తీవ్ర గాయాలు

కొమరాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనేరు స్టేషన్ పరిధిలోగల రామభద్రపురం సమీపంలో అయినాడ జంక్షన్‌కు చెందిన తుమ్మపల్లి నారాయణరావు మంగళవారం తెల్లవారుజామున హిరాఖండ్ రైలు నుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విజయనగరం నుంచి రాయగడ ఆలయానికి కుటుంబంతో కలిసి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు నారాయణరావును జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలించారని జీఆర్పీ పోలీసులు తెలిపారు. రైల్వే హెచ్‌సీ రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో క్లూస్ టీం పరిశీలన

గరుగుబిల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుపల్లిలో అయ్యప్పస్వామి ఆలయంలో ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, క్లూస్ టీము సిబ్బంది మంగళవారం పరిశీలించారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఆలయంలో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి తాళాలు పగలుగొట్టిన విషయం విదితమే. సర్పంచ్ బి.మహేష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆలయ ప్రాంగణాన్ని క్లూస్ టీము సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించారు. దొంగతనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నెల్లి మర్ల తాలుకా యూనిట్ అధ్యక్షుడు పి.వీరన్నదొర ఆధ్వర్యంలో మంగళవారం 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులకు రావాల్సిన రూ.25 వేల డీఏ, ఎస్ఎల్ బకాయిలు చెల్లించాలని, పీఆర్‌సీ కమిషన్ నియ మించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, తదితర డిమాండ్లపై చర్చించారు. ఉద్యోగులపై యాప్‌ల భారం తగ్గించాలని, రిటైర్డ్ ఉద్యోగుల ఈఈఎల్, గ్రాడ్యూటీల చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు చక్రవర్తి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పతి వాడ త్రినాథ, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం

విజయనగరం టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల సాధనకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంది వెంకటరమణ, బాలభాస్కర్‌లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు బకాయిలు ఉన్నా సుమారు రూ.30వేల కోట్ల రూపాయల విడుదల, పీఆర్‌సీ, ఐఆర్, డీఏ, ఎస్ఎల్ఎస్ ప్రధాన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా మంగళవారం రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని క్యాంటీన్ సమీపంలో ప్రారంభించారు.

రాజాం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పార్వతి

రాజాం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్‌పర్సన్, మరో 13 మంది సభ్యులతో కూడిన కమిటీ జాబితాను మంగళవారం విడుదల చేసింది. వీరిలో 12 మంది టీడీపీకి చెందినవారు కాగా ఇద్దరు జనసేన, ఒకరు బీజేపీకి చెందినవారు. చైర్‌పర్సన్‌గా గురవాం గ్రామానికి చెందిన గురవాన పార్వతిని నియమించారు. ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్‌గా లచ్చుభుక్త ధనలక్ష్మి, సభ్యులుగా గురవాన ధనుజంయరావు, యలకల దుర్గాప్రసాద్, తమ్మినేని ఝాన్సీ, గిన్నిపల్లి జగన్మోహనరావు, బోనుల రమణమ్మ, యడ్ల అసిరినాయుడు, నాగళ్ల రమణ, కేత శంకర్రావు, పొన్నాడ భీమేశ్వర్రావు, గ్రంధి వెంకట జగన్‌బాబు, డబ్బాడ కృష్ణ, లెంక పార్వతి, గుడివాడ చిన్నమ్మడును నియమించారు. నూతన కమిటీ ప్రకటనను రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ సమతం శ్రీనివాసరావు ధ్రువీకరించారు.

అదనంగా మూడు పోలింగ్ కేంద్రాలు

గజపతినగరం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో అదనంగా మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఈఆర్‌వో ప్రమీలాగాంధీ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో 264 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 1200 జనాభా దాటిన మూడు పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేశామని చెప్పారు. బొండపల్లి మండలంలోని బొండపల్లి, గంట్యాడ మండలంలోని లక్కిగాం, కరకవలస గ్రామాల్లో అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు బీఎల్వోల నియమించామని తెలిపారు. అలాగే 18 ఏళ్ల వయస్సు గల యువతి, యువకులు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల అధికారి వెంకటలక్ష్మి, వైసీపీ, బీజేపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గత 44 రోజులుగా జిందాల్ కంపెనీ తమకు న్యాయం చేయాలని బొడ్డవర గ్రామంలో జిందాల్ నిర్వాసితులు శాంతియుత నిరసనలు చేస్తుంటే నియోజకవర్గ ఎంపీ, ఎమ్మెలు కనీసం స్పందించడం లేదని జిందాల్ నిర్వాసితులు వాపోయారు. మంగళవారం వీరు సీపీఎం నేత చల్లా జగన్ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించే ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నారా.. లేరా అంటూ బ్యానర్ ప్రదర్శించారు. తమకు జిందాల్ యాజమాన్యంతో మట్లాడి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

జాతీయ పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకించాలి

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ ప్రభుత్వం తన ఫాసిస్టు ఎజెండాను దేశంపై రుద్దుతున్నదని, దీనిలో భాగంగా జాతీయ పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకించాలని సీపీఐ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు కోరారు. మంగళవారం విజయనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బెహరా శంకరరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని, మాట్లాడారు. బీహార్‌లో ఎన్నికలు దగ్గరకు వచ్చిన తర్వాత ఓటర్ సీ రివిజన్ పేరిట ప్రతిపక్షాలకు చెందిన 64 లక్షల మందిని తీసివేశారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ఆధార్, రేషన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు ప్రమాణికం కాదని, భూమి డ్యాక్యుమెంట్స్ ఎలక్షన్ కమిషన్ నిర్ణయం అని.. బీజేపీ కనుసన్నలలో ఇటువంటి నిర్ణయాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి శంకరరావు, మద్ది అప్పలరాజు, సత్యారావు, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

పీసా చట్టం పకడ్బందీగా అమలుచేయాలి

● ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిరావు



మాట్లాడుతున్న తిరుపతిరావు

పాలకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కులను అమలు చేయాలని, పీసాచట్టం పకడ్బందీగా అమలుచేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.తిరుపతిరావు, గిరిజన సంఘం నాయకులు ఆరిక భానుచందర్ డిమాండ్‌చేశారు. మంగళవారం మండలంలోని మల్లంగూడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను అమలు చేయకుండా మోసగిస్తున్నాయని ఆరోపించారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు, మండల కార్యదర్శి కె.రాము, డి.దుర్గారావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు బీవీ రమణ, కె.గౌరీశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని తాడికొండ, రేగిడి, దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 18న పార్వతీపురంలో జరిగే మహాసభలో ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. కాగా తాడికొండ పీహెచ్‌సీ, ఎనిమిది సబ్‌సెంటర్ల పరిధిలో ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా కె.నిర్మల, ఎస్.కృష్ణవేణి, కోశాధికారిగా పి.భారతితో పాటు 14 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

హామీలు అమలు చేయాలి



మక్కువలో నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

మక్కువ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్కీమ్‌వర్కర్లగా పనిచేస్తున్న ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని సీఐటీయూ మండల నాయకులు కృష్ణారావు, దాలమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మక్కువ, సంబర పీహెచ్‌సీల ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సరస్వతి, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):ఆర్ఎంపీల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకుడు రుద్ర కోటేశ్వరరావు కోరారు. పార్వతీపురంలో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ఎంపీలు ప్రజలకు వారధులుగాఉంటారని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే ఆలయాల అభివృద్ధి

పాలకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ఆలయాల అభివృద్ధి జరుగుతుందని టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు తెలిపారు. మంగళవారం పాలకొండలో కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయఆవరణలో చదునుచేసే పనులు ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి పనులకోసం నిధులు వెచ్చించడానికి పట్టణానికి చెందిన పైడికృష్ణ ప్రసాద్ ముందుకువచ్చారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ

పార్వతీపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా ఆసుపత్రిలో మంగళవారం క్యాన్సర్ స్క్రీనింగ్‌పై నిర్వహించిన శిక్షణకు పార్వతీపురం జిల్లా నుంచి ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు వైద్య బృందంతో హాజరయ్యారు. గైనకాలజిస్టులు, డెంటల్ వైద్యులు, ఎన్‌సీడీ వైద్య బృందానికి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ నిర్వహించారు. మెడికల్ అంకాలజీ విభాగానికి చెందిన వైద్యులు, సంబంధిత విభాగాల వైద్యులు పవర్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు.ఈసందర్భంగా నోటి క్యాన్సర్, గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్స్ గుర్తించే విధానం, పరీక్షించడం, రిఫరల్, చికిత్స తదితర అంశాలపై వివరించారు.కార్యక్రమానికి జిల్లా నుంచి ఎపిడెమియాలజిస్ట్ కె.కౌశిక్, జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల గైనకాలజిస్టులు, డెంటల్ వైద్యులు, ఎఫ్ఎల్‌సీ రమణి, డీఈవో తాజ్ తదితరులు హాజరయ్యారు.

హైదరాబాద్‌లో నులకజోడు యువకుడి మృతి

భామిని, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నులకజోడు గ్రామానికి చెందిన కార్తీక్ (24) హైదరాబాద్‌లో మరణించారు. ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన వలరౌతు కార్తీక్ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. బంధువులు,కుటుంబసభ్యుల కథనం మేరకు.. ఓప్రైవేటు సంస్థలో లిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కార్తీక్ కుప్పకూలిపోయాడు. స్థానికుల సహకారంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు.కార్తీక్ మృతదేహాన్ని స్వగ్రామానికి అక్కడ ఉన్న బంధువులు సహకారంతోతీసుకొస్తున్నారు. కార్తీక్ మృతిచెందిన సమాచారంతో గ్రామంలో విషాదం అలముకుంది.

ప్రజారోగ్య పరిరక్షణకు శ్రమించాలి

కురుపాం రూరల్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకోసం మరింత శ్రమించాలని ఆశా వర్కర్లకు డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి పిలుపునిచ్చారు. మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆశా డే సందర్భంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు బహత్తర బాధ్యత నెరవేరుస్తున్నట్లు చెప్పారు. ఈనెల 12న జరిగే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతంచేయాలని కోరారు. కార్యక్రమంలో మొండెంఖల్, నీలకంఠాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు బి.ప్రజ్ఞ, అమర శింహారెడ్డి పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి టి.మణి కోరారు.మంగళవారం మండలంలోని తాడికొండ పీహెచ్‌సీలో ఆశాడే నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిపాలు ఆవశ్యకతను వివరించారు.కేసుల్లో పీఎఫ్, మలేరియా పీవీ కేసుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బుద్దేశ్వరరావు, సూపర్‌వైజర్ ఐ.శ్రీను, భారతి, సింహాచలం పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయి వైద్యసిబ్బంది అప్రమత్తంగాఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ఎంకే తిరుమలప్రసాద్ తెలిపారు.గరుగుబిల్లిలోని పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రస్తుత సీజన్‌లో ప్రబలే వ్యాధులపై వైద్య సిబ్బందికి సూచనలుచేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆరోగ్యయాప్‌లపై గ్రామస్థాయి వైద్య సిబ్బందిపరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.కార్యక్రమంలో సిబ్బంది జగదీశ్వరి, రమణమ్మ, ఉదయకుమారి, బురిడి పకీరునాయుడు పాల్గొన్నారు.

●పార్వతీపురం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మెరుగైన వైద్య సేవలను అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆశ వర్కర్లకు జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘు సూచించారు. మండలంలోని బందులొప్పి ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో ఆశాడే కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

●బలిజిపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గళావల్లి పీహెచ్‌సీని పార్వతీపురం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి విజయమోహన్ సందర్శించారు. ఆశాడే సందర్భంగా ఆశాకార్యకర్తలు, వైద్యసిబ్బందికి వ్యాధినిరోధక టీకాల ప్రాధాన్యం, కాలానుగుణంగా వచ్చే వ్యాధులు, హైరిస్కు గర్భిణులను త్వరగా గుర్తించి అందించాల్సిన సేవలపై సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.రేవతి, డాక్టర్ రిషికుమార్ పాల్గొన్నారు.

సీతంపేటలో తిరంగ ర్యాలీ

సీతంపేట రూరల్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సీతంపేటలో హర్‌ఘర్ తిరంగ ర్యాలీని మండల ప్రత్యేకాధికారి జి.చిన్నబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల15వరకు గ్రామాల్లో దేశభక్తి పెంపొందించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు,హెచ్ఎం చంద్రరావు,కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణాలు

నిధులు రాక.. నిర్మాణాలు జరగక

● ఇదీ వీరఘట్టంలో సామూహిక మరుగుదొడ్ల పరిస్థితి

వీరఘట్టం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో నిధులు విడుదల కాకపోవడంతో నాలుగు చోట్ల సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి పనులు చేపట్టారు. నిధులుసకాలంలో రాకపోవడంతో పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇంతలో వైసీపీ అధికారంలోకి రావడంతో వీటి నిర్మాణాలపై దృష్టిసారించలేదు. వీరఘట్టంలో ప్రజల అవసరాలు తీర్చేందుకు అప్పట్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని ప్రభుత్వం ముందుకొచ్చిన విషయం విదితమే. తర్వాత పనులు ముందుకు సాగకపోవడంతో మరుగుదొడ్లు నిర్మిస్తున్న ప్రాంతంలో తుప్పలు, డొంకలు పెరగడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అయితే గత డాది టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణాలపై కదలికి వచ్చింది. ఈ నేపథ్యంలో అంచనాలు వేసి గ్రామ పంచాయతీ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంపీడీవో సూచించారని వీరఘట్టం పంచాయతీ ఈవో బి.కోటేశ్వరరావు తెలిపారు.

సేంద్రియ ఎరువులతో బహుళ ప్రయోజనాలు

●ప్రకృతి వ్యవసాయం డీపీఎం శ్రావణ్‌కుమార్‌నాయుడు



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న శ్రావణ్‌కుమార్‌నాయుడు

గరుగుబిల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో కూడిన వాటిని ఉపయోగిస్తే బహుళ ప్రయోజనం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం శ్రావణ్‌కుమార్ నాయుడు తెలిపారు. ఖరీఫ్‌లో రసాయన ఎరువుల వినియోగానికి దూరంగా ఉండాలని కోరారు. మంగళవారం తోటపల్లిలోని జట్టు కార్యాలయం ప్రాంగణంలో 15 మండలాలకు చెందిన వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఏఈవోలు, వ్యవసాయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అధికంగా క్రిమి సంహారక మందులు వినియోగించడంతో భూమి సారవంతం తగ్గుతుందన్నారు. రసాయనఎరువులు, పురుగుమందులు వాడకుండా సహజసిద్ధంగా లభించేవాటిని ఉపయోగించాలన్నారు. ప్రకృతివ్యవసాయ విధానాలపై రైతుల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.నూతనవిధానంలో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏటీఎం, ఎ-గ్రేడ్‌మోడల్, అన్నపూర్ణ పంటల నమూనాతో అధికదిగుబడి సాధించవచ్చన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

గరుగుబిల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలకు ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో జ్యోత్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.13 రైతుసేవా కేంద్రాల పరిధిలో రైతులు సాగు చేస్తున్న పంటలు వివరాలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. రైతులు సాగుచేస్తున్న పంటకు సంబంధించిన సమాచారం అందించాలని తెలిపారు. ఈ-పంట నమోదు వల్ల ప్రకృతి వల్ల నష్టం వాటిల్లితే తగిన పరిహారం ప్రభుత్వపరంగా అందుతుందని పేర్కొన్నారు.

వెయ్యి టన్నుల ఎరువులు సిద్ధం

మక్కువరూరల్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చినట్లు ఏవో చింతల భారతి తెలిపారు. ఖరీఫ్‌లో వెయ్యిటన్నుల ఎరువులను అందుబాటులో సిద్ధంగా ఉంచామని చెప్పారు. మంగళవారం మండలంలోని పనసభద్ర పంచాయతీలోని దుగ్గేరు, పనసభద్ర గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వరినాట్లు వేస్తున్న రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



గుమ్మలక్ష్మీపురం: సబ్‌స్టేషన్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు. మంగళవారం పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ ఏడాదిలో రూ.30 వేల కోట్లు విద్యుత్ భారం, అదానీ స్మార్ట్ మీటర్లతో ప్రజలను శాశ్వత దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. విద్యుత్ భారాలపై ప్రజలు తీవ్రవ్యతిరేకతతో ఉన్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూటమి నాయకులు స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండి ఉండగా ఉంటామని గతంలో పేర్కొన్నారని, ఇప్పుడు కనీసం స్పందించడం లేదని ఆరోపించారు.

●గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లేవిడి సబ్‌స్టేషన్ ఆవరణలో సీపీఎం ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం సిబ్బందికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రజలకు హామీఇచ్చిన కూటమి పెద్దలు ఇప్పుడు పెంచడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గౌరీశ్వరరావు, పువ్వల తిరుపతిరావు, ఎం.సన్యాసిరావు, ఎం.వెంకటకరావు పాల్గొన్నారు.

దళాయివలసలో ఉపాధి సామాజిక తనిఖీ



దళాయివలసలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు

గరుగుబిల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో 19వ విడత ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీని సిబ్బంది చురుగ్గా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఎస్ఆర్‌పీ ఈదుబిల్లి పున్నపునాయుడు దళాయివలస, పెద్దూరుతోపాటు పలు గ్రామాల్లో వేతనదారుల నుంచి సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 25 పంచాయతీల్లో సుమారు రూ. 20 కోట్లుకుపైగా ఉపాధి నిధులు వ్యయం జరిగిందని తెలిపారు. ఉపాధి వేతనాలతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను లోతుగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గురువారం నుంచి తొమ్మిదో తేదీ వరకూ వివరాలు సేకరించిన ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



పాలకొండ: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సిబ్బంది

పాలకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలుతోనే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ పర్యవేక్షురాలు కె.దశారత్నం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వాటపాగు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దశారత్నం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతను వివరించాలని ఏఎన్ఎం, ఆశవర్కర్లకు సూచించారు.

●గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరిడిలో మంగళవారం ఐసీడీఎస్ పీవో విజయగౌరి ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో తల్లిపాలు ఆవశ్యకతను, కాయగూరలు, ఆకుకూరలు, పళ్లు ప్రదర్శించి పౌష్టికాహారం ప్రాముఖ్యతను మహిళలు, గర్భిణులకు వివరించారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలుపౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.నాగమణి పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.సుగుణకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని రావుపల్లిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఎదుగుదలకు తల్లిపాలు అవసరమన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలను అందించాలన్నారు. మొదటిధపా తల్లి పాలు సహజ టీకాగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పలువీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి, కార్యకర్తలు సావిత్రి, మంగమ్మ, అరుణకుమారి, సన్యాసమ్మ పాల్గొన్నారు.

వాట్సప్ సేవలు వినియోగించుకోవాలి

సాలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వనమిత్ర వాట్సప్ సేవలు ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని మునిసిపల్ అధికారులుకోరారు. మంగళవారం సాలూరులో ఇన్‌చార్జి కమిషనర్ ప్రసాదరావు, శానిటర్ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణల ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ ప్రధాన కూడలి, తహసీల్దార్ కార్యాలయం వద్ద వనమిత్ర వాట్సప్ సేవల గురించి వివరించారు. వన మిత్ర వాట్సప్ ద్వారా 161 పౌర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.



వాట్సప్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మునిసిపల్ అధికారులు

నేడు రెడ్‌క్రాస్ సమావేశం

పార్వతీపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. రెడ్ క్రాస్ జిల్లా బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులను చైర్మన్, వైస్‌చైర్మన్, కోశాధికారి, ఇతర సభ్యులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

నేడు ఆహార కమిషన్ సభ్యుడి పర్యటన

పార్వతీపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు బుధవారం పర్యటించనున్నారని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి, అధికారులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రేపు తోటపల్లిలో గోవింద గోశాలలు ప్రారంభం

గరుగుబిల్లి, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల పరిధిలో గురువారం వాన ప్రస్థాశ్రమం, అన్నప్రసాద సత్రం,గోవింద గోశాలలకు ప్రారంభించనున్నట్లు దేవస్థానం అభివృద్ధి సేవాట్రస్ట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.ఈకార్యక్రమానికి మంత్రులు కె.అచ్చెన్నాయుడు, జి.సంధ్యారాణి, ఎ.రామనారాయణరెడ్డి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి హాజరుకానున్నారని పేర్కొన్నారు.

11న అప్రెంటిషిప్ మేళా

సాలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి); స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న పధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ ఒకప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐలో ఏదైనా ట్రేడ్‌లో పాసైన వారు హాజరుకావచ్చని పేర్కొన్నారు.

కారుణ్య నియామకం

పార్వతీపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో ఐటీడీఏలో పనిచేసి మృతి చెందిన మండంగి పండయ్య కుమారుడికి మండంగి సంతోష్‌కుమార్ రికార్డు అసిస్టెంట్‌గా నియమిస్తూ పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశాలను జారీచేశారు. ఈ మేరకు కారుణ్య నియామకప త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో మురళీధర్, ఏపీవో ప్రసాద్, ఏఈ తిరుపతిరావు పాల్గొన్నారు.

వీరఘట్టంలో ఎరువుల పంపిణీ

వీరఘట్టం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ఎఫ్‌పీవో కార్యాలయంలో ఎఫ్‌పీవో అధ్యక్షుడు కరణం చిన్నంనాయుడు ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం ఎరువుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డీఆర్‌డీఏ డీపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు ఎరువులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాము, ఎల్‌సీ ఆనంద్, ఐఎఫ్‌సీ యాంకర్ పర్సన్ సోనియా, ఎఫ్‌పీవో సీసీ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

రికవరీ.. ఏదీ పురోగతి?

(5వ పేజీ తరువాయి)

లేదు. ఈ విషయంలో సంబంధిత శాఖ సిబ్బందిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

● ఉన్నతి రుణాలు తీసుకున్న సభ్యులు మూడేళ్ల కాలంలో చెల్లించకపోతే నూటికి రూ.25పైసలు వడ్డీతో వసూళ్లు చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా మొండి బకాయిలను వన్‌టైం సెటిల్మెంట్(ఓటీఎస్)పద్ధతిలో వసూళ్లకు సంబంధిత వెలుగు సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు.

2025, ఏప్రిల్ నాటికి ఉన్న నివేదికల ఆధారంగా ఉన్నతి రుణాల రికవరీ పరిశీలిస్తే .. టీపీఎంయూ మండలాల్లో సీతంపేట 1.65శాతం, హిరమండలం 51, కొత్తూరు 1.66, మందస 3.81, మెళియాపుట్టి 7.45, పాతపట్నం 21, భామిని 0.76 శాతంగా ఉంది. ఎన్నేళ్లయినా ఈ రికవరీ శాతం మాత్రం పెరగకపోవడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలు ఈ రుణాలు తీసుకున్న సంఘాల సభ్యులు చెల్లిస్తున్నారా? లేదా?... చెల్లిస్తే ఏళ్ల గడుస్తున్నా.. రికవరీలో పురోగతి ఎందుకు కనిపించడం లేదు? రుణాలు ఏమైనా పక్కదారి పట్టాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఉన్నతి బాటలోనే..

ఐటీడీఏ పరిధిలోని ఏడు టీపీఎంయూ మండలాల్లో స్త్రీనిధి రుణాల రికవరీ పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో సీతంపేట మండలంలోని 231 స్వయంశక్తి మహిళా సంఘాలకు రూ.24లక్షల వరకు రూపాయి వడ్డీ రుణాలను అందజేశారు. అయితే నేటికి ఇంకా రూ.10లక్షల వరకు రుణ బకాయిలు ఉన్నాయి. ఈవిధంగానే మిగిలిన మండలాల్లో కూడా స్త్రీనిధి రుణాల బకాయిల ఔట్‌స్టాండింగ్ ఎక్కువగా ఉన్నట్లు బోగట్టా. సంఘాల నుంచి రికవరీ చేయడంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రుణాలు ఇచ్చేందుకు వెనకడుగు

నిబంధనల ప్రకారం రుణాలు తీసుకున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు ప్రతి నెలావాయిదాల రూపంలో తిరిగి చెల్లించాలి.ఇటువంటి సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్‌లు కూడా ముందుకొస్తాయి.కానీ ఈ ఏడు మండలాల్లో ఉన్నతి, స్త్రీనిధి రుణాల రికవరీ పూర్తిగా మందకోడిగా జరుగుతుండడంతో బ్యాంక్‌లు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో రెండేళ్లుగా ఈ ప్రాంతంలో ఎవరికీ రుణాలు ఇవ్వడం లేదని తెలుస్తోంది.

ఏపీడీ ఏమన్నారంటే..

'ఐటీడీఏ పరిధిలోని ఏడు టీపీఎంయూ మండలాల్లో గతంలో ఇచ్చిన ఉన్నతి రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టిసారించాం. స్త్రీనిధి రుణాల రికవరీ కూడా జరుగుతుంది. రుణాల రికవరీపై ప్రత్యేక డ్రైవ్ చేపడతాం.' అని వెలుగు ఇన్‌చార్జి ఏపీడీ సన్యాసిరావు తెలిపారు.

జ్వరాలు వదల్లే!

(5వ పేజీ తరువాయి)

ఉన్న రక్షిత నీటి పథకం ట్యాంకు గత కొన్నేళ్లుగా శుభ్రం చేసిన దాఖలు లేవని గ్రామస్థులు చెబుతున్నారు. అంతే కాకుండా గ్రామంలో కాలువలు చెత్తా చెదారాలతో నిండాయని, మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోందని వాపోతున్నారు. దీనివల్ల రాత్రి వేళల్లో దోమల బెడద అధికంగా ఉంటుందోని తెలియజేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కలుషిత నీరే తాగుతున్నాం

మా గ్రామంలో రక్షిత నీటి పథకాన్ని శుభ్రం చేయడం లేదు. ట్యాంకు లోపల నాచు పట్టేసి, ఫంగస్ విపరీతంగా ఉంది. ఆ కలుషిత నీరే తాగాల్సి వస్తోంది.

- ఊలక నవీన్, జ్వర పీడితుడు, వనజ

సీజనల్ జ్వరాలే..

ఏజెన్సీ ప్రాంతాలతో పాటు వనజ గ్రామం నుంచి ఎక్కువగా జ్వర పీడితులు వస్తున్నారు. వీరికి తగు చికిత్స అందిస్తున్నాం. పూర్తిగా జ్వరం తగ్గిన తరువాత ఇంటికి పంపిస్తున్నాం. సీజనల్ జ్వరాలతో అత్యధికమంది సీహెచ్‌సీకి వస్తున్నారు.

-చైతన్య, ఆసుపత్రి సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, చినమేరంగి

మెడికల్ షాపుల్లో తనిఖీలు

కొమరాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమినాయుడువలసలో ప్రైవేటు క్లీనిక్, జంఝావతి సెంటర్‌లో మెడికల్ షాపుల్లో తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అరుణ్‌కుమార్, ఏఎస్ఐ రామరావునాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులు నుంచి అధిక మొత్తంలో డబ్బును వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. క్లీనిక్‌ల్లో అనుమతిలేకుండా సెలైన్లు బాటిళ్ల ఏర్పాటుచేస్తున్నారని, ఈతనిఖీలను హెచ్చరికలుగా భావించాలని అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

